క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవ దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని లక్ష్మీబజార్‌లో లక్ష్మీ నారాయణస్వామి కల్యాణోత్సవం, రథోత్సవ కార్యక్రమాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్ప అలంకరణ, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. కళ్యాణోత్సవం అనంతరం సాయంత్రం స్వామి రథోత్సవం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి లావణ్య దంపతులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గెల్లి రామరాజు, గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్ప, ఉపాధ్యక్షుడు కేబీ మధుసూదన్, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి గెల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సవారమ్మ ఉత్సవాలు

గుమ్మఘట్ట: మండలంలోని ఎర్రంపల్లిలో సవారమ్మ దేవర ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఎస్.హొసళ్లి గ్రామంలో వెలసిన సవారమ్మ దేవతను సోమవారం జలధికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని మంగళవారం గ్రామంలో ఊరేగించనున్నట్లు వారు తెలిపారు.

మానవ హక్కుల కౌన్సిల్ అధ్యక్షుడిగా పవన్



ఉరవకొండ: ఏపీ మానవహక్కుల కౌన్సిల్ అసోసియేషన్ అనంతపురం, సత్యసాయి జిల్లాల అధ్యక్షుడిగా ఉరవకొండ పట్టణానికి చెందిన బెస్త పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఆదివారం మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంగేరి వెంకటరమణ ద్వారా నియామక ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మానవహక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.

విజ్ఞానాన్ని అందించే ఆయుధం పుస్తకం



లైబ్రరీలో పుస్తకాలను చదువుతున్న చిన్నారులు

రాయదుర్గంటౌన్: మనిషికి విజ్ఞానాన్ని అందించే గొప్ప ఆయుధం పుస్తకమని లైబ్రేరియన్ ఆదిలక్ష్మి అన్నారు. ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం(వరల్డ్ బుక్, కాపీరైట్ డే)ను పురస్కరించుకుని పట్టణంలోని గ్రంథాలయంలో పాఠకులతో పాటు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన బాలబాలికలచే పుస్తక పఠనాన్ని నిర్వహించారు. అనంతరం ప్రపంచ పుస్తక దినోత్సవ ప్రాధాన్యతను లైబ్రేరియన్ వివరించారు. విద్యార్థి దశ నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి గలిగించేలా చైతన్యం తేవాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



సూచనలిస్తున్న వైద్యులు

రాయదుర్గంటౌన్: బ్రాహ్మణి వెల్ఫేర్ సొసైటీ, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతుల ఆదేశాల మేరకు శాంతిరామ్ మెడికల్ కాలేజీ వైద్యం బృందంచే నిర్వహించిన ఉచిత కంటి, గుండె వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలకు 120 మంది హాజరు కాగా వైద్యుడు సురేష్‌బాబు టీం ఆధ్వర్యంలో చికిత్సల అనంతరం 71 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అలాగే ఇద్దరికి గుండె సంబంధిత శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. ఆపరేషన్లకు ఎంపికైన రోగులకు వైద్యులు సూచనలు, సలహాలు అందజేశారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని చెర్లోపల్లిలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి ఆదివారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

మహాపురుషుడు బసవేశ్వరుడు



రాయదుర్గం: ఊరేగింపులో మహిళల నృత్యాలు



రాయదుర్గం: బసవేశ్వరుడి చిత్రపటం ఊరేగింపులో ట్రాక్టర్ నడుపుతున్న విప్ కాపు



వజ్రకరూరు: తత్రకల్లులో బసవేశ్వరస్వామి జయంతి వేడుకలు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- ఘనంగా బసవ జయంతి

రాయదుర్గం: కుల రహిత సమాజం కోసం కృషి చేసిన మహాపురుషుడు బసవేశ్వరుడు అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం బసవ జయంతి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని కోటలో వెలసిన వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో సతీమణి కాపు భారతితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి ఉత్సవ గుర్రాన్ని ఆలయం నుంచి విప్ కాపు నెత్తిన మోస్తూ తీసుకొచ్చారు. స్వామి ఊరేగింపు ట్రాక్టర్‌ను ఆయనే నడిపారు. నందికోలు నాట్యం చేపట్టి యువకులను ఉత్సాహపరిచారు. కోట నుంచి బళ్లారి రోడ్డు లోని ఆంజనేయస్వామి ఆలయం వరకూ ప్రత్యేక మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య బసవన్న ఊరేగింపు శోభాయమానం సాగింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కలశ హారతులు పట్టారు. వీరభద్రుడి వేషధారణ తో పాటు త్రిశూలం చేతపట్టి మహిళల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విప్ మాట్లాడుతూ కలియుగదైవంగా పిలవబడే బసవన్న అడుగుజాడుల్లో యువత నడవాలన్నారు. వీరశైవ లింగాయతల అభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కుల సంఘం ఆధ్వర్యంలో విప్‌ను సన్మానించారు. విప్ వెంట జెడ్పీటీసీ మహేష్, కౌన్సిలర్ ఐనాపురం మంజు, ఉడేగోళం అప్పాజి, మున్సిపల్ మేనేజర్ కిశోర్, కులసంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే డీహీరేహాళ్ మండలంలోని తిమ్మాపురంలో నిర్వహించిన బసవ జయంతి వేడుకల్లో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, పాటిల్ అజయ్, సచివాలయ కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచ్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

కణేకల్లు: కణేకల్లులో బసవ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు వీరశైవులు వేదవతి హగిరి నుంచి జలాలను ఊరేగింపుతో తీసుకొచ్చి ఆలయంలో బసవేశ్వరునికి అభిషేకం చేశారు. ఊరేగింపు సమయంలో వీరభద్రుని వేషధారుని వీరగాసే నృత్యాలు అలరించాయి. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు విప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు ముత్తు స్వామి, పాటిల్ వివరాజుగౌడ్, వేలూరు మరియప్ప, తిప్పేస్వామి, శరబన్నగౌడ్, నాగరాజు, పాలాక్షి, బసవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వేమన, వీరేష్, గోపాల్, గంగాధర్ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం, ఎర్రంపల్లి గ్రామాల్లో బసవేశ్వరుని జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బసవేశ్వరుని చిత్రపటాలను ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్, హంపన్న, కట్టెగౌడ, బసవరెడ్డి, శ్రీధర్, పురుషోత్తంరెడ్డి, హనుమారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఈశ్వరప్ప, గంధవీడి తిప్పేస్వామి, జగన్నాథ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: బసవ జయంతి వేడుకలను వీరశైవుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దేవగిరి గ్రామంలో బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయంత్రం బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఊరేగించారు.

ఉరవకొండ: వీరశైవుల ఆరాధ్యదైవం బసవేశ్వరుస్వామి జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక పాతగాంధీచౌక్ వద్ద ఉన్న బసవేశ్వరుని ఆలయంలో అర్చకులు ధనంజయస్వామి, మల్లికార్జునస్వామి అధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఎద్దుల బండ్ల పై బసవేశ్వరుని చిత్రపటాన్ని ఉంచి వందలాది ఎద్దుల బండ్లతో ర్యాలీ చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవసంఘం ప్రధాన కార్యదర్శి పాల్తూరుశంకర్, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, పాండు, విరేష్‌బాబు, మఠంమల్లికార్జున, రుద్రప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు. అలాగూ ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి, విఠల్ రుక్మిణి వృద్ధాశ్రమంలో అనాథలు, రోగులకు పాలు, పండ్లు బసవేశ్వర యూత్ సభ్యులు అందించారు.

వజ్రకరూరు: మండలంలోని తత్రకల్లు గ్రామంలో ఆదివారం జంగమ, వీరశైవలింగాయత్ ఆరాధ్య దైవం బసవేశ్వరస్వామి జ యంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా స్థానిక శివాలయంలో బసవేశ్వరస్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేపట్టారు.



ఉరవకొండ: అలంకరణలో బసవేశ్వరస్వామి



డీహీరేహాళ్: వేడుకల్లో పాల్గొన్న కాపు భారతి

'అక్షయ తృతీయ' సందడి



బంగారు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

రాయదుర్గంటౌన్: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని బంగారు దుకాణాల్లో సందడి నెలకొంది. గత ఏడాదితో పోల్చితే బంగారు ధర అధికంగా ఉండడంతో ఆశించిన మేర లేకపోయినా మోస్తారుగా వ్యాపారం జరిగినట్లు జువెలరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎంజీ ఘని, హరూన్ తెలిపారు. గత ఏడాది పసిడి ఆర్నమెంట్ ధర రూ.39 వేలు ఉండగా ప్రస్తుతం రూ.52 వేలు ఉంది. అలాగే ప్రస్తుతం 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.61 వేలు పలుకుతుండగా గత ఏడాది రూ. 48 వేలు పలికింది.

పకడ్బందీగా ప్రవేశ పరీక్షలు

ఉరవకొండ/కంబదూరు: ఉరవకొండ పట్టణంలోని రేణుమాకులపల్లి రహదారి వద్ద ఉన్న ఏపీ సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఆదివారం పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఐదో తరగతి ప్రవేశ పరీక్షలకు మొత్తం 778 మంది విద్యార్థులకు గాను 92 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ జరిగిన ఇంటర్ ప్రవేశ పరీక్షకు 404 మంది విద్యార్థులకు గాను 61 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, ప్రిన్సిపాల్ కె.భారతి పర్యవేక్షించారు. అలాగే కంబదూరు మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతికి సంబంధించి 806 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 748 మంది హాజరయ్యారు. ఇంటర్‌కు సంబంధించి 372 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 300 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.పరీక్ష కేంద్రాన్ని డీసీఓ బాలాజీనాయక్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద ఏఎస్ఐ ఓబుళపతి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



హాజరైన ఆయా మండలాల వలంటీర్లు

కళ్యాణదుర్గం:ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, రూరల్ మండలం, కంబదూరు, బ్రహ్మసముద్రం మండలాల వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. పథకాలను ప్రతి ఇంటికీ అందించాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, సచివాలయ కన్వీనర్లు అర్చన, ఆంజనేయులు, గంగాధర్, పెరుగు తిమ్మరాజు, శంకర్‌రెడ్డి, రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ పోస్టులు భర్తీ చేయండి

రాష్ట్రంలో ప్రత్యేక డీఎస్సీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రత్యేక అవసరాల అభ్యర్థుల సంఘం నాయకులు మంత్రిని కలిసి విన్నవించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం జిల్లా ప్రత్యేక అవసరాల అభ్యర్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు వీరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి తలారి అంజినయ్య తదితరులు మంత్రిని కలిశారు.

భగీరథ జయంతిని అధికారికంగా నిర్వహించాలి ఉప్పర (సగర) కులస్తుల ఆరాధ్య దైవం భగీరథ జయంతిని అధికారికంగా జరపాలని ఉప్పర సంఘం నాయకులు కోరారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఆదివారం ఉప్పర సంఘం నాయకులు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌ను కలిసి విన్నవించారు. ఈనెల 26న భగీరథ జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సగర యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్, ప్రచార అధ్యక్షుడు గిరిబాబు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుకుమార్, నాయకులు శ్రీనివాసులు, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మద్దతిద్దాం

- మంత్రి ఉషశ్రీచరణ్
- జగనన్నే మా భవిష్యత్‌కు భారీ స్పందన



కళ్యాణదుర్గం: ఇందిరమ్మ కాలనీలో 'జగనన్నే మా భవిష్యత్' నిర్వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



వజ్రకరూరు: పందికుంటలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం/శెట్టూరు/వజ్రకరూరు: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతిద్దామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కళ్యాణదుర్గం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన పథకాలు, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పథకాల మధ్య తేడాను ప్రజలకు వివరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను ఇంటింటికీ అతికించి ప్రభుత్వంపై ప్రజా అభిప్రాయాన్ని మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ కాలెండర్ మేరకు పథకాలను నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేస్తున్న సీఎం జగనన్నకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు హేమ, సచివాలయ కన్వీనర్లు అర్చన, ఆంజనేయులు, గంగాధర్, పెరుగు తిమ్మరాజు, శంకర్‌రెడ్డి, నాయకులు మల్లితో పాటు వలంటీర్లు, గృహ సారథులు, పలువురు పాల్గొన్నారు.

- శెట్టూరు మండలంలోని కనుకూరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు, సర్పంచ్ వెంకటేశులు, నాయకులు హరినాథ రెడ్డి, సిద్దలింగప్ప, కిష్టప్ప, రవి, తదితరులు పాల్గొన్నారు.
- వజ్రకరూరు మండలంలోని పందికుంట, పందికుంటతండా గ్రామాల్లో చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్ర మంలో సర్పంచ్ ఉమామహేశ్వరి, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, నాయకులు రత్నశేఖర్, హిమవంత్‌రాజు, వెంకట్రామిరెడ్డి, గోవిందు, ఓబుశేసు, ఎం. ర మేష్, మృత్యుంజయ, ఓబిరెడ్డి, అంగడి శ్రీనివాసులు, బోయ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా తాగునీరందించాలి



టీ వీరాపురం ఫారెస్ట్ వద్ద పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న విప్ కాపు

రాయదుర్గం: పట్టణ ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరందించే బాధ్యత అధికారులు తీసుకోవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశించారు. కణేకల్లు పంప్‌హౌస్ నుంచి రాయదుర్గం పట్టణానికి హెచ్ఎల్‌సీ నీటిని సరఫరా ప్రధాన పైప్‌లైన్ శనివారం మరోచోట పగిలిపోయింది. దీంతో విప్ కాపు ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రంగంలోకి దిగిన కమిషనర్ దివాకర్‌రెడ్డి చురుగ్గా పనులు పూర్తయ్యేలా కృషి చేశారు. ఆదివారం పైప్‌లైన్ మరమ్మతు పనులను విప్ కాపు పరిశీలించారు. కావాల్సిన సామగ్రి ఏర్పాటుకు సహకరించారు. నీటి సరఫరా జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని, ఎంతసేపైన సరే మీతోనే ఉంటానని తెగేసి చెప్పారు. దీంతో పనుల్లో మరింత పురోగతి పెంచిన అధికారులు ఎట్టకేలకు పూర్తిచేసి నీటి పునరుద్ధరణ జరిగేలా చర్యలు చేపట్టారు. రాత్రికి ఓహెచ్‌ఆర్‌కు స్టోరేజీ చేసి సోమవారం ఉదయం వార్డులకు నీటిని విడుదల చేస్తామని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. వేసవి పూర్తయ్యే వరకు పైప్‌లైన్ల లీకేజీల పై పర్యావేక్షణ పెంచి అప్రమత్తంగా ఉండాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని చెరువు కట్ట కింద పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.4,330 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. పట్టుబడిన వారంతా రాజమ్మకాలనీకి చెందిన వారుగా సీఐ తెలిపారు.

ముగ్గురి అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పరిధిలో నివాసం ఉంటున్న సున్నంగేరికి చెందిన హరిత అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- బుక్కరాయసముద్రం బొమ్మలాట పల్లికి చెందిన స్వరూప అనే యువతి కుటుంబం ప్రస్తుతం నగరంలోని నవోదయకాలనీలో నివాసం ఉంటోంది.కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ కనిపించలేదు. బాధితులు ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రామచంద్రనగర్‌లో సాయి శివ అనే యువకుడు శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భానుడి భగభగలు.. జనం బెంబేలు



నిర్మానుష్యంగా మారిన కణేకల్లు రోడ్డు

రాయదుర్గం/రాయదుర్గం టౌన్: ఎండలు మండిపోతుండడంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. సగటున 36 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుండే ప్రచండ భానుడు నిప్పులు కక్కుతున్నాడు. సాయంత్రం 5 గంటల వరకూ వేడి గాలులు ఏమాత్రం తగ్గడం లేదు. పది రోజులుగా ఇలాంటి పరిస్థితులే ఉండడంతో జనం విలవిల్లాడిపోతున్నారు. ఇళ్లనుండి భయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో మధ్యాహ్న సమయాన పట్టణంలోని ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో రహదారులు నిర్మానుష్యమవుతున్నాయి. ఈ నెలాఖరుకి ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువవడంతో పాటు వడగాల్పుల తీవ్రత కూడా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు కూడా జారీచేసింది. మే లోని ఎండలను ఊహిస్తేనే ప్రజలు భీతిల్లిపోతున్నారు. ఎండలకు భయపడి కొంత మంది గొడుగు నీడలో ప్రయాణాలు సాగిస్తుండగా, మరికొందరు ముఖానికి గుడ్డకట్టుకుని వెళ్తున్నారు. ఎండల తీవ్రత పెరగడం వల్ల శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, మంచినీటి పాకెట్లకు డిమాండ్ పెరిగింది.

చిరు వ్యాపారులకు ఇబ్బంది..

ప్రధాన రహదారులు, వీధుల్లో తోపుడు బండ్లు, సైకిళ్ల పై పండ్లు, కూరగాయాలు, తినుబండారాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు వేడిమికి అల్లాడుతున్నారు. ప్రచండ బానుడి భగభగలకు ఉదయం 10 తర్వాత రోడ్లన్నీ జనసంచారం లేక బోసిపోతున్నాయి. నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి కొనుగోలుకు వచ్చేవారి సంఖ్య తగ్గుతోంది. దీంతో అన్నీ విధాలా నష్టపోవాల్సి వస్తోందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత క్రమంగా పెరిగిపోతుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సాధ్యమైనంత వరకూ బయటకు రాకపోవడం మంచిదంటున్నారు.

శీతలపానీయాల వైపు మొగ్గు

ఎండవేడిమిని తట్టుకొనేందుకు ప్రజలు శీతలపానీయాలు వైపు మొగ్గచూపుతున్నారు. కూల్‌డ్రింక్ షాపులు, కళింగరకాయలు, కొబ్బరి బొండాల వ్యాపారాలు ఊపందుకున్నాయి. పట్టణంలో చాలా వరకు బావులు అంతరించిపోవడంతో యువకులు, పిల్లలు తోటల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో ఈత కొడుతూ సేద తీరుతున్నారు. మంచినీళ్లు, మజ్జిగను అధికంగా తీసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి బీజాక్షర హోమం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్ప రూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారికి బీజాక్షర హోమం నిర్వహించారు. అనంతరం స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ఆకుపూజ, పల్లకీసేవ, కుజదోష, కాలసర్పదోష నివారణకు సుబ్రహ్మణ్యేశ్వర బీజాక్షర హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి పూజలు నిర్వహించి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఏళ్ల కల.. నెరవేరిన వేళ..!



నాడు

అధ్వానంగా బాదనహాళ్-గొడిశెలపల్లి రహదారి



నేడు

పూర్తయిన రహదారి

- రూ.60 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం బాదనహాళ్- గొడిశెలపల్లి రహదారికి మహర్దశ కలిగింది. అధ్వాన్న దారి, ఆపై గతుకుల ప్రయాణం సాగించలేక ఇన్నాళ్లూ నరకయాతన అనుభవించిన గ్రామస్తుల సుదీర్ఘ కల ఎట్టకేలకు నెరవేరింది. గత టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన కాలవ దృష్టికి రోడ్డు సమస్యను పలు మార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న పాపన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రామానికి వచ్చిన విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి రోడ్డు సమస్యను ప్రజలు తీసుకెళ్లారు. సత్వరం స్పందించిన విప్ ఇంజినీరింగ్ అధికారులను రప్పించి నివేదికలు సిద్ధం చేయించారు. ప్రభుత్వం నుంచి రూ.60 లక్షల నిధులు రాబట్టేలా కృషి చేశారు. బాదనహాళ్- దొడగట్ట వరకూ 2.50 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు, అక్కడి నుంచి గొడిశెలపల్లి వరకూ దారుణంగా దెబ్బతిన్న 1.50 కిలోమీటర్లు కొత్తగా తారు రోడ్డు నిర్మాణం పనులు కేవలం నెల వ్యవధిలో పూర్తి చేయించారు. దీంతో ఏళ్ల నాటి కల.. నెరవేరిన వేళ అంటూ మూడు గ్రామాల ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు విప్ కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.